

సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పనుల సాగదీతతో ప్రమాదాలు

- నత్తనడకన హంద్రీ పాత బ్రిడ్జి మరమ్మతు పనులు
- కిక్కిరిసిన ట్రాఫిక్‌తో రాకపోకలకు అంతరాయం - రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో సాగుతున్న హంద్రి హైవే బ్రిడ్జి మరమ్మతు పనులు సాగుతూ ఉండడంతో కిక్కిరిసిన ట్రాఫిక్ సమస్య కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోని ఒక అమాయక వాహనదారుడు ప్రమాదానికి గురై చివరికి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన వెనుక హైవే అధికారుల నిర్లక్ష్యం ప్రధానంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. కర్నూలు నగరంలో చౌరస్తా నుంచి కృష్ణానగర్ వైపు వెళ్లే జాతీయ రహదారిలో నిర్మించిన హంద్రీ పాత బ్రిడ్జి కాలం చెల్లడంతో దానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైవే అధికారులు ఆ పనులను దాదాపు రెండు నెలల క్రితం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలను నూతన బ్రిడ్జిపై వచ్చి వెళ్ళే విధంగా ట్రాఫిక్ సిబ్బంది హైవే అధికారులు ట్రాఫిక్‌ను మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు రెండు బ్రిడ్జిలపై తిరిగే వాహనాలు మరమ్మతుల కారణంగా కేవలం కొత్త బ్రిడ్జి పైనే వాహనాలరాకపోకలు సాగించాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది.

మళ్లింపు సరే... ప్రమాద నివారణ చర్యలేవి?

హైవే అధికారులు బ్రిడ్జినిర్మాణ పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను మళ్ళించారే తప్ప అక్కడ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను విస్మరించారన్న విమర్శ వాహనదారుల నుంచి తలెత్తుతోంది. హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తారు రోడ్డును వేసిన తర్వాత ప్రక్కనే సమాంతర ఎత్తులో మట్టి పోయాల్సి ఉంది. సదరు చర్యలు అక్కడ లేకపోవడంతో రోడ్డుకు పక్కన గుంతగా ఏర్పడి అటుగా వచ్చే వాహనాలు ఇరుకులో వెళ్లే సమయంలో అదుపుతప్పి పడిపోయే పరిస్థితి ఏర్పడింది. సరిగ్గా ఇదే పరిస్థితి కారణంగానే అనేక ప్రమాదాలు స్థానికంగా జరుగుతున్నాయి.



నత్తనడకగా సాగుతున్న మరమ్మతు పనులు

ఒకరు మృతి, పలువాహనాలకు ప్రమాదాలు

హైవే , ట్రాఫిక్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరిగ్గా ఈ బ్రిడ్జి వద్ద గత కొద్దిరోజుల క్రితం ఒక వ్యక్తి ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మతి చెందారు. ఇదిలా ఉండగా ఈనెల 24న ఆదివారం మధ్యాహ్నం పెద్దపాడుకు చెందిన యువకుడు సరిగ్గా ఇదే పరిస్థితిలో బైకు నుంచి జారిపడి ప్రమాదంలో కాలు విరిగిపోయింది. అంతకుముందు అనేకమంది ఇదే ప్రాంతంలో ప్రమాదానికి గురై గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, హైవే బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

నాటుసారా స్థావరాలపై
విస్తృత దాడులు

- డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-పత్తికొండ

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఆదేశాల మేరకు పత్తికొండలోని డిప్యూటీ కమిషనర్ (నేరవిభాగం), పి. నాగ మద్దయ్య పర్యటించారు. సోమవారం పత్తికొండ పోలీస్ స్టేషన్ ను పి .నాగ మద్దయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ...నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటు సారా , బెల్ట్ షాపులపై మరింత విస్తృత దాడులు చేయాలని తెలిపారు. నాటుసారా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పూర్తిగా నిర్మూలించాలని సిబ్బందిని హెచ్చరించారు. పాత నేరస్తుల అందరిపై సిఆర్‌పిసి 110,109 ప్రకారం బైండ్ ఓవర్లు చేయాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం డంప్ లపై దృష్టి సారించి, పాత నేరస్తులపై నిఘా పెంచాలని తెలిపారు. అక్రమ మద్యాన్ని సరఫరా చేసే మార్గాల్లో రూట్ వాచ్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేదాకా ఎటువంటి సెలవులు మంజూరు చేయరాదని, నిర్విరామంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.పత్తికొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ స్వర్ణలత మాట్లాడుతూ పత్తికొండ సెబ్‌స్టేషన్ పరిధిలో పలు నాటు సారా స్థావరాలపై దాడుల్లో 92 కేసులు నమోదు చేసి, 1738 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నాటు సారా తయారీకి ఉపయోగించిన 64,900 లీటర్ల ఊట ను ధ్వంసం చేసి, తయారీకి ఉపయోగించే 9080 కిలోల బెల్లం స్వాదీన పరచుకొని, 37 మందిని రిమాండ్ కు తరలించామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అక్రమ మద్యం పై నమోదైన 56 కేసుల్లో 686 లీటర్ల మద్యాన్ని స్వాదీన పరచుకొని 64 మందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. మొత్తం మీద 155 కేసుల్లో 8 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల కమిషన్ గైడ్ లైన్స్‌కు లోబడి, అందరూ బాధ్యతతో పనిచేయాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటిదాకా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పనిచేస్తూ వస్తోందన్నారు. రానున్న ఎలక్షన్స్ కొరకు ఇకపై కూడా ఇదే స్ఫూర్తితో మరింత పారదర్శకంగా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, కర్నూలు సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ నరసానాయిడు, ఎస్ఐ. కార్తీక్ , సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

- ఛేదించిన వెల్దుర్తి పోలీసులు ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్‌పి
- ఒకరు అరెస్ట్ ఇద్దరు పరారీ - రూ.6,4 లక్షల విలువైన 16 మోటర్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- వెల్దుర్తి

అంతర్‌రాష్ట్ర సైకిల్‌మోటార్ల దొంగను వెల్దుర్తి పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి రూ. 6.40,000 విలువైన 16 సైకిల్‌మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి సూచనలతో వెల్దుర్తి సిఐ సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎస్ఐ ఎం చంద్రశేఖర్ రెడ్డి , వారి సిబ్బందితో ఈ కేసును ఛేధించారు. కర్నూలు స్పెషల్ బ్రాంచ్ అధికారుల సమాచారం మేరకు క్రిష్ణగిరి మండలం ఎరుకల చెరువు గ్రామంలో ఒక షెడ్డులో దాచిన మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మాధవరం గ్రామానికి చెందిన దర్శినేని నాగభూషణ్ అంతరాష్ట్ర మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేసి విచారించగా అనంతపురం టౌన్‌లో నంద్యాల జిల్లా నందివర్గం , నందికొట్కూరులో వెల్దుర్తి లో , ఇతర జిల్లాల నుండి 16 మోటార్ సైకిళ్లను దొంగలించి ఇక్కడ దాచిపెట్టినట్లు వాటిని అమ్మడానికి కృష్ణగిరి మండలం ఎరుకలచెరువు గ్రామానికి చెందిన కురువ అశోక్ , నంద్యాల జిల్లా డోన్ రూరల్ పరిధిలో ఉన్న రేకులకుంట గ్రామానికి చెందిన బెస్త వెంకటేష్ లతో కలిసి పథకం ప్రకారం ఈ మోటార్ సైకిళ్ళు అమ్మడానికి పెట్టుకున్నట్లు తెలుపగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా రాసి డోన్ సబ్‌జైలుకు రిమాండ్ నిమిత్తం పంపారు. కేసు నమోదు చేసి ఈ వాహనాలు యజమానులు ఎవరు అన్న కోణంలో ఆర్‌టిఒకు లేఖ రాసి ఆ సమాచారంతో వారి మోటార్ సైకిళ్లను కోర్టు ద్వారా ఇస్తామని తెలిపారు. క్రిష్ణగిరి మండలం ఎరుకల చెరువు గ్రామానికి చెందిన కురువ అశోకు , డోన్ తాలూకా రేకులకుంట గ్రామవాసి బెస్త వెంకటేశు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపుతామని పూర్తిగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దొంగలించిన మోటార్ సైకిల్ సమాచారాన్ని ఇచ్చిన వెల్దుర్తి సర్కిల్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా హుస్సేన్‌ను, వెల్దుర్తి సిఐ సురేష్ కుమార్ రెడ్డి చేతుల మీద నగదు రివార్డును అందజేశారు. గత నెల 2 వ తేదీ అమకతాడు టోల్గేట్ వద్ద ఓ ప్రైవేటు బస్సులో తరలిస్తున్న సుమారు నాలుగున్నర కోటి విలువ చేసే నగదు , బంగారు, వెండి పట్టుకున్న కేసులో కూడా స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా కీలకపాత్ర వహించారు.



రివార్డు అందజేస్తున్న అధికారి

బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించండి

- ప్రజల పక్షాన పోరాడే సిపిఎంను గెలిపించండి - సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఆయిల్ అండ్ రైస్ మిల్ కార్మికుల విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం ఆయిల్ అండ్ రైస్ మిల్ కార్మికుల గౌరవ అధ్యక్షులు సిహెచ్ సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ ,సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడారు. ఈ దేశంలో సంపాదన సృష్టించేది కార్మికులే, ఈ దేశ అభివృద్ధికి పాటుపడేదని, కార్మికులే ఈ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తారని, శ్రమశక్తే లేకపోతే ఈ దేశం అంధకారంగా మారుతుందని అన్నారు. అంతటిప్రాముఖ్యత కలిగిన కార్మికులను చులకనగా చిన్నచూపు చూస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను 2024 ఎన్నికల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బిజెపిఆదీనంలో కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా 44 లేబర్ కోడ్లను కుదించి నాలుగు కోడ్లుగా చేసి యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటూ లక్షల కోట్ల రూపాయలను సబ్సిడీని ఇస్తూ, దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నన్నారు. ప్రభుత్వరంగాల న్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నదన్నారు. అన్నదమ్ముల వలె కలిసి ఉన్న భారతదేశ ప్రజలను కులం, మతంపేరుతోవిద్వేషాలను రెచ్చగొడుతూ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదన్నారు. ప్రపంచ దేశాల కంటేఎంతోప్రాముఖ్యతకలిగిన భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నంచేసి మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావాలని చూస్తున్నదన్నారు. ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నదని విమర్శించారు. బిజెపి చేస్తున్న ప్రజావ్యతిరేక చట్టాలకు మద్దతుగా పార్లమెంటులో వైసిపి, టిడిపి ఎంపీలు అనుకూలంగా ఓట్లు వేస్తున్నారన్నారు. అందుకే వైసిపి, అవకాశవాద టిడిపి, జనసేన పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కార్మికుల హక్కులు రక్షించబడాలంటే, సిపిఎం కర్నూల్లో గెలవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సిపిఎం గెలుపులో కార్మిక వర్గం కీలక పాత్ర పోషించాలన్నారు. ఆయిల్ అండ్ రైస్ మిల్లు కార్మికులు అన్ని యూనియన్ల వారు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్



రమణమ్మకు జోహార్లు అర్పిస్తున్న రాముడు, మద్దిలేటి తదితరులు

రమణమ్మ ఆశయసాధనకు కృషి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నిరంతరం ప్రజల పక్షాన పని చేసిన రమణమ్మ ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని సిపిఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు, సీనియర్ నాయకుఉ జి.మద్దిలేటి కోరారు. జి. రమణమ్మ 11వ వర్ధంతి సభ మమతా నగర్ రమణమ్మ భవన్ సిపిఎం వార్డు నాయకుడు దేవన్న అధ్యక్షతన నిర్వహిచారు. టి. రాముడు, సీనియర్ నాయకులు జి.మద్దిలేటి మాట్లాడుతూ రమణమ్మ ఆశయాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఆమె ఎంతగానో తపిచారని, చైతన్య నగర్, మమతా నగర్, అమీర్ హైదర్ ఖాన్ నగర్ ఇలాంటి ప్రాంతాలలో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రయత్నించారన్నారు. కర్నూల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు అనేక సేవలందించారని కొనియాడారు. ఆమె సేవలను ప్రజలు ఎప్పుడు మరవరని అన్నారు. ఆమె స్ఫూర్తితో అనేకమంది మహిళా నాయకులు మహిళా ఉద్యమంలోకి వచ్చారని అన్నారు. మహిళల పై జరుగుతున్న హత్యలను అత్యాచారాలను అరికట్టడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో ఉండే బిజెపిని, దానిని బలపరిచే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పా లన్నారు. సిపిఎం వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలపర చాలని అన్నారు. అదే జి.రమణమ్మ ఆశయమని అన్నారు. వార్డు నాయకురాలు రేణుకమ్మ, ఎల్లమ్మ. యశోద ,పద్మ ,రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్ రాష్ట్ర రాతిదూలం పోటీలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం మండలం లంకాయపల్లె గ్రామంలో పెద్దమ్మ అవ్వ స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈనెల 26న మంగళవారం అంతర్ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఈ పోటీల లో 6 పళ్ల విభాగం వృషభాలు మాత్రమే పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని మొదటి విజేత అయివృషభ యజమానులకు రూ.30 వేలు నగదును వైసిపి నాయకుడు కడమకుంట్ల అమర్నాథ్ రెడ్డి, రెండవ బహుమతి రూ.20 వేలు సర్పంచి సలహాదారుడు సుల్తాన్, మూడో బహుమతి రూ.15 వేలు మాజీ ఎంపిటిసి బొబ్బిలి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ లు, నాలుగో బహుమతి రూ.10 వేలు తెలుగుదేశం పార్టీ నాయకులు కడమకుంట్ల లింగన్న, ఐదవ బహుమతి రూ.7500, ఆరో బహుమతి రూ.5 వేలు నగదు ఇస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక వైసిపి నాయకుడు శంకర రెడ్డి ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆసక్తిగల వృషభ యజమానులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలోని వక్కెరవాగు సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన షాపు యజమానులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కార్పెంటర్లు (టింబర్ షాపులు) వృత్తిచేస్తూ డోర్లు తయారు చేసి విక్రయించే షాపులు రెండు మెకానిక్ షాప్, డేటింగ్ షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. షాపులలో పర్నీచర్ టేకువుడ్ కర్ర కావడం వల్ల దాదాపు రూ.కోటి పైనే నష్టం వాటిల్లిందని ఆ షాపు నిర్వాహకులు అప్పులు తెచ్చి నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం వారిని తక్షణమే గౌస్ దేశాయ్ కోరారు. అగ్ని ప్రమాదం సంఘటన తెలిసిన వెంటనే సిపిఎం ప్రతినిధి బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ నష్టపోయిన వారితో విచారించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువ నష్టం జరగడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం కూడా చాలా స్పష్టంగా కనబడుతుందని అన్నారు. ఫైర్ ఇంజన్ల కోసం ఫోన్ చేస్తే అవి అందుబాటులో లేకపోవడంతో గంటన్నర తర్వాత వచ్చాయని, అవికూడా ఒకటి రెండు ఇంజన్లు మాత్రమే ఉండడంవల్ల మంటలు ఆర్పడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల నష్టం ఎక్కువ జరగడానికి కారణం అయిందన్నారు. అగ్నిప్రమాదం జరగడానికి ఈ ప్రాంతంలో ఉన్న వైన్ షాప్ కారణమని. షాపు యజమానులు తమ ఆవేదనను వ్యక్తం చేశారని తెలిపారు. ఆదివారం కావడం వైన్‌షాప్ నుంచి మందుబాబులు మందుతో పాటు సిగరెట్లు, బీడీలు తాగి అక్కడే పడేయడంతో అక్కడ అంతా ఎండిన చెత్త ఉండడం వల్ల మంటలు షాపులోకి వెళ్లి పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. షాపు యజమాని అబ్దుల్లా షాపులో ఉన్న టేకు కర్ర రూ.40 లక్షల విలువ చేస్తుందని అది మొత్తం కాలిపోయిందన్నారు. రూ.20 లక్షల విలువచేసే మిషన్లు కాలిపోయాయన్నారు. యజమాని జావిద్ షాపులో ఉన్న టేకు కర్ర కూడా అంతే విలువైంది నష్టం జరిగిందని, మిషన్లు కూడా కాలిపోయాయని ఆయన తెలిపారు. ఆటో మెకానిక్ షాప్‌లో ఉన్న ఒక ఆటో మూడు బైకులు, కారు మొత్తం సర్వం కాలిపోయిందని తెలిపారు. అందువల్ల జిల్లా కలెక్టర్ సందర్శించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్నటు వైన్ షాపును తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సందర్శించిన ప్రతినిధి బందంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న,, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి పాల్గొన్నారు.



సైకిళ్ళు పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిటి నిర్వహకులు

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని రామలింగయ్య పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అక్కడ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆర్‌డిటి సంస్థ సోమవారం 68 సైకిళ్లను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌డి రామేశ్వరి మాట్లాడుతూ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి కాలి నడకతో రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అందుకు ఆర్‌డిటి సంస్థ ఉచితంగా సైకిళ్ళు ఇవ్వడం హర్షించ తగ్గ విషయమని అన్నారు. పేదప్రజల కోసం అహర్నిషలు కృషి చేస్తున్న ఆర్‌డిటి సంస్థను ప్రజలు ఆదరించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలు పడుతున్న ఇబ్బంది చూసి గృహాలు కూడ నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ రహినాబీ, ఎటిఎల్ వెంకటేష్, భవాని, సిఒ రామాంజనేయులు, హెచ్‌ఎం బీమయ్య, సిఆర్‌పి నగేష్, టీచర్ హనుమంతు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రంగస్వామి ఎన్నిక

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బి. రంగస్వామి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ బార్ అసోసియేషన్‌లో మొత్తం 96 ఓట్లు ఉండగా, 90 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. అధ్యక్ష స్థానానికి బి. రంగస్వామి, వై. శ్రీనివాసరెడ్డి లు పోటీ పడగా, రంగస్వామి 53 ఓట్లు రాగా, శ్రీనివాస రెడ్డికి 37 ఓట్లు వచ్చాయని, రంగస్వామి 16 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారన్నారు. ప్రధాన కార్యదర్శితో పాటు ఉపాధ్యక్షులు, కోశాధికారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన రంగస్వామి కి అడ్వకేట్ అశోక్ కుమార్ పూలమాలవేసి స్వీట్లు తినిపించారు. ఎంపిపి నారాయణదాసు, సీనియర్ ,జూనియర్ న్యాయవాదులు, హాస్టల్ వార్డెన్ రమేష్, ఫారెస్ట్ అధికారి రవి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, విద్యుత్ శాఖ ఉద్యోగి రామకృష్ణ, ఎపియుడబ్ల్యుజె నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అభినందిస్తున్న అశోక్‌కుమార్



మాట్లాడుతున్న దయారమాదేవి

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, శానిటేషన్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని మిడ్ డే మీల్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయారామాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కర్షక భవన్లో జె .నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వండి పెడుతూ ఎన్నో కష్టాలకు భర్తిస్తున్నారన్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీలు ఏమాత్రం సరిపోవటం లేదని అన్నారు. వారి కష్టాన్ని గుర్తించి మెనూ చార్జి పెంచి వారిని ఆదుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందన్నారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.



జనంతో కిటకిటలాడుతున్న కర్నూలు జివి మాల్

జివి మాల్‌లో రంజాన్, వేసవికి బంపర్ ఆఫర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో కొత్తగా ప్రారంభించిన జివి మాల్‌లో రంజాన్ వేడుకలు, వేసవికాలం సందర్భంగా ఈనెల 26 నుంచి ప్రత్యేక బంపర్ ఆఫర్లు ప్రారంభిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. సోమవారం భారీగా ప్రజలు రావడంతో మాల్ కిక్కిరిసిపోయింది. రంజాన్ వేడుకల సందర్భంగా ముస్లిం సోదరీ సోదరీమణులకు సరికొత్త కలెక్షన్లతో స్పెషల్ ఆఫర్స్ ప్రారంభమయ్యాయి. వేసవికాలం సందర్భంగా బెంగాల్ కాటన్, కోనసీమ కాటన్ ,లెనిన్ కాటన్, పొలాచి కాటన్, మంగళగిరి కాటన్, కోట కాటన్, డిజిటల్ కాటన్, హైదరాబాద్ పల్లవి కాటన్ శారీస్, భగల్పూర్ రాజ్ కోటి పటోళ శారీస్ వంటి అన్ని రకాల కాటన్ దుస్తులు లభిస్తున్నాయి. సరికొత్త పట్టు శారీస్, మెన్స్, కిడ్స్ కలెక్షన్లతో ప్రజలకు అనుగుణమైన ధరలకే స్పెషల్ ఆఫర్లు మార్చ్ 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

29న ముఖ్యమంత్రి పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రఘురాం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న ఎమ్మిగనూరులో పర్యటించనున్నారు. వీవర్స్ కాలనీ మైదానంలో జరిగే 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ ప్రాంగణాన్ని వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు పరిశీలించారు. సోమవారం సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం పరిశీలించారు. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని రఘురాం, వైసిపి కర్నూలు ఎంపి అభ్యర్థి బివై.రామయ్య, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక సూచించారు. నాయకులు బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, కౌన్సిలర్ శివప్రసాద్, ఖిలారా హుస్సేన్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. ఆదోని టికెట్ నాకే

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఆదోని టికెట్ తనకే వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆదోని ఎమ్మెల్యే టికెట్ బిజెపికి కేటాయిస్తున్నారనే సమాచారం టీవీ ఛానల్‌లోనూ, సోషల్ మీడియాలోనూ రావడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా మీనాక్షినాయుడు గృహానికి చేరుకొని తమ పరిస్థితి ఏమిటని మీనాక్షి నాయుడుతో చర్చించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. మీడియాలో వచ్చిన కథనాలను ఎవరూ నమ్మొద్దని, ఆదోని ఎమ్మెల్యే సీటుపై ఇంకా ఏ అధికారిక ప్రకటన రాలేదని తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందని పూర్తి నమ్మకం ఉందని, ఎవరూ అధైర్య పడొద్దని నచ్చజెప్పారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, నాయకులు ఉన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ప్రచారంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సంక్షేమమే వైసిపి లక్ష్యమని వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డులో కోట ఈశ్వర స్వామి దేవాలయం దగ్గర నుంచి బుట్టా రేణుక ప్రచారం మొదలుపెట్టారు. ప్రచారంలో భాగంగా బుట్టా రేణుక ప్రతి ఇంటికీ వెళ్లి మాట్లాడారు. జగనన్న చేసిన సంక్షేమాలను వివరిస్తూ మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలని తెలిపారు. జగన్ అందరికీ సమాన పాలన అందిస్తున్నారని, జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. 20వ వార్డు కౌన్సిలర్ బంగి ప్రమీల, వార్డు ఇన్‌ఛార్జి బంగి శ్రీరామ్, వార్డు నాయకులు యయు.నగేష్, కర్ల, వీరేశ్, మల్లి, హరి, నవీన్, లోకేష్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, టౌన్ బ్యాంకు చైర్మన్ యుకె.రాజశేఖర్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, కౌన్సిలర్లు రాజశర్మ, అమాన్, శివప్రసాద్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక

ఇసుక రీచ్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రీచ్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. రీచ్‌లో తగినంత ఇసుక అందుబాటులో ఉందని, లబ్ధిదారులు ప్రభుత్వ సూచనల ప్రకారం చలానాలు ఆన్‌లైన్‌లో చెల్లించి ఇసుకను తీసుకెళ్లాలని తెలిపారు. రీచ్‌లో నిబంధనల మేరకే ఇసుకను తరలించాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, తహశీల్దార్ ఓబులేసు, ఎస్ఐ తిమ్మయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస రాజు, ఆర్ఐ జెర్మియా పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

హోలీ రోజు 'జంపలకిడి పంబ'

- మహిళల వేషధారణలో పురుషులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

హోలీ పండగ రోజున మండలంలోని ఓ గ్రామంలో వింత ఆచారం కనిపిస్తుంది. హోలీ పండగ నాడు అక్కడ 'జంబలకిడి పంబ' దృశ్యాలను చూడవచ్చు. 'జంబలకిడి పంబ' సినిమా పేరు చెప్పగానే అందరికి మగాళ్లు ఆడవాళ్లలా వింతగా ప్రవర్తించడం గుర్తుకొస్తుంది. ఇది చూసి నవ్వుకుంటాం. ఇదేదో నవ్వించడానికి తీసిన సినిమా అనుకుంటాం. కానీ అచ్చం అలాంటి వింతను, విడ్డురాలను ఆచారంగా పాటిస్తున్న గ్రామస్తులు ఉన్నారంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. హోలీ పండగ వచ్చిందంటే పిల్లల నుంచి పెద్దల వరకు రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకోవడం తెలుసు. కానీ ఈ గ్రామంలో మాత్రం హోలీ పండగకు విచిత్ర వేషధారణలతో రతి మన్మథులకు పూజలు చేయడం ఆనవాయితీ. మండలంలోని సంతేకుడ్లూరు గ్రామానికి ప్రత్యేకత ఉంది. కామదహనంతో మొదలైన వేడుకల్లో రెండు రోజులపాటు పండగ వాతావరణం కనిపిస్తుంది. సోమవారం పిండి వంటలు చేసుకున్నారు. నేడు కామదహనంతో, రథోత్సవంతో పండగలు ముగిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆచారం తరతరాల నుంచి కొనసాగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కోరికలు తీరుతాయని తమ నమ్మకమని చెబుతారు స్థానికులు. పురుషులు ఆడవాళ్ల వేషధారణలో పూజించడం వల్ల పంటలు బాగా పండుతాయని, గ్రామానికి కష్టాలు రాకుండా ఉంటాయని, ఇంట్లో ఏ సమస్యలూ ఉండవని స్థానికులు చెబుతున్నారు. అందుకే ప్రతేడాది హోలీ పండగకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ ఆచారాన్ని చూసేందుకు భారీగా వస్తారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా చాలా మంది వచ్చి మహిళల వేషధారణలో పూజలు చేస్తారు.



ఐదేళ్ల నుంచి పాటిస్తున్నాను - విద్యార్థి భార్గవ్

చీర కట్టుకొని, నగలు, పూలు అలంకరించుకుని.. అచ్చం మగువలుగా తయారవుతారు. అనంతరం రతీ మన్మథులను పూజిస్తారు. ఇక్కడ ప్రతేడాది హోలీ పండగ సమయంలో మగవారు ఆడవేషం వేస్తారు. నేను 5 ఏళ్ల నుంచి ఈ ఆచారాన్ని పాటిస్తున్నాను.

చిన్నప్పటి నుంచి పాటిస్తున్నాను - గ్రామస్తుడు, సంతేకుడ్లూరు

చిన్నప్పటి నుంచి ఈ ఆచారాన్ని పాటిస్తున్నాను. ఇది తరతరాల సంప్రదాయం. ఇలా ఆడవారి వేషధారణలో మన్మథుని పూజిస్తే పంటలు బాగా పండుతాయి. గ్రామానికి ఎలాంటి కష్టాలూ రావు. ఇంట్లో సమస్యలు ఉండవు. ఈ పండగను రెండు రోజుల పాటు జరుపుకొంటాం.


మహిళల వేషధారణలో ఉన్న పురుషులు

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణంలో హోలీ పండగ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే హెచ్‌బిఎస్ కాలనీ, శిల్పా కాలనీ, గాంధీ నగర్, లక్ష్మిపేట, వీవర్స్ కాలనీ, సోమప్ప నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, వైఎస్ఆర్ సర్కిల్, మునెప్ప నగర్ తదితర కాలనీల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా చిన్నారులు, పెద్దలు, మహిళలు, యువత రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుని పండగలో పాల్గొన్నారు. చిన్నారులు ఉదయం నుంచే వాటర్ గన్స్, బాటిళ్ల ద్వారా వివిధ రకాల రంగులను నింపి చిందులు వేస్తూ రంగులు చల్లుకున్నారు. పలు కాలనీలు, రోడ్లు రంగులమయమయ్యాయి. పట్టణంలోని 20వ వార్డు కోటా వీధి ప్రచారంలో పాల్గొన్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు చిన్నారులు హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. వారితో ముచ్చటించి గ్రూపు ఫొటో దిగి ఆనంద పరిచారు. బనవాసి వద్ద గల నవోదయ, గురుకుల పాఠశాలలో విద్యార్థులు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **ఆదోని**లో రంగులు పూసుకుని కేరింతలు కొడుతూ చిన్నారులు నృత్యం చేస్తూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి చిన్నారులు, యువత రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒకరికి రంగులు చల్లుకొని ఆనందోత్సాహాల మధ్య హోలీని జరుపుకున్నారు. ఆటపాటలతో కేరింతలు కొడుతూ, సాంప్రదాయ రంగులను చల్లుకొని సంతోషాన్ని పంచుకున్నారు. ప్రతి వీధిలో చిన్న, పెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఉంచారు.



విధుల నుంచి వాలంటీరు తొలగింపు

ప్రజాశక్తి - హోళగుంద

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మార్లమడికి సచివాలయం ముద్దటమాగి గ్రామానికి చెందిన తలారి లక్ష్మన్న అనే వాలంటీరును విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ ఆజాద్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు... సదరు వాలంటీరు వైసిపి ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి ముద్దటమాగి గ్రామంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వాలంటీరు పాల్గొన్నట్లు ఈనెల 23న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు విచారణ చేపట్టారు. వాలంటీరును తొలగించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వాలంటీర్లను తొలగించడమే కాక వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాలు జారీ చేశారు. అధికారులు మాత్రం ప్రచారంలో పాల్గొన్న వాలంటీర్లపై ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. కేవలం తొలగింపు ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ ఆజాద్‌ను వివరణ కోరగా... వాలంటీర్లు ఒక్కరే వెళ్లి ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులతోపాటు ప్రచారంలో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు.


ప్రచారంలో పాల్గొన్న వాలంటీరు (ఫైల్)

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే బీవీ - వంద మంది మైనార్టీ యువకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 12వ వార్డు, వివిధ వార్డులకు చెందిన వైసిపి మైనారిటీ యువ నాయకులు ఇంతియాజ్, నవాజ్, నిసార్, రహంతుల్లా, బడేసాబ్, బాషా, మున్నా, రియాజ్, ఇస్మాయిల్, రాఘవేంద్ర, వారి అనుచరులు సుమారు 100 మంది యువకులు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో, ముఖ్యంగా నిరుద్యోగ యువతకు చేసిన మోసం ఏ ముఖ్యమంత్రీ చేయలేదని తెలిపారు. అన్నపూర్ణాంధ్రప్రదేశ్‌ను గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. ఇటీవల టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీలు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బీవీ వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

వాలంటీర్ల సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో వాలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కొనియాడారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు టిడిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయని తెలిపారు. వాలంటీర్లపై చంద్రబాబు, టిడిపి నాయకులు, పవన్ కల్యాణ్ నోటి నుంచి కించపరిచే మాటలు వినపడుతున్నాయని విమర్శించారు. మహిళల అదృశ్యానికి వాలంటీర్లే కారణమని చెప్పడం హాస్యాస్పదమని తెలిపారు. టిడిపికి అధికారం ఇస్తే వాలంటీరు వ్యవస్థ నడుం విరగ్గొడతానని అంటున్నారని, ఇది కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ల కథ తేలుస్తామని బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రతి పేదకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఉందని చెప్పారు. వాలంటీర్లను ఉగ్రవాదులు, జిహాదీలు, స్లీపర్ సెల్స్‌తో పోల్చుతూ అత్యంత అవమానకరంగా మాట్లాడుతూ, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాలంటీర్లు రూ.5 వేల గౌరవ వేతనంతో సమాజంలో నిస్వార్థంగా సేవ చేస్తున్నారని తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో టిడిపి నాయకులు హాయిగా నిద్రపోతూ ఇళ్లకే పరిమితమైన వేళ వాలంటీర్లే రాష్ట్రవ్యాప్తంగా గడప గడపకూ సేవలందించారని చెప్పారు. అంత గొప్ప సేవ చేసిన వాలంటీర్లపై టిడిపి నాయకులు ఈ రకంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వాలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన టిడిపి నాయకులు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు సెబ్ స్టేషన్, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల తనిఖీల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం హోళగుంద, క్షేత్రగుడి, పెద్దహరివాణం చెకపోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటు సారా, బెల్ట్ షాపులపై దాడులు మరింత విస్తృతం చేయాలని ఆలూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్‌కు తెలిపారు. నాటుసారా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పూర్తిగా నిర్మూలించాలని సిబ్బందిని హెచ్చరించారు. పాత నేరస్తులపై సిఆర్‌పిసి 110, 109 ప్రకారం బైండోవర్లు నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం డంప్‌లపై దృష్టి సారించి, పాత నేరస్తులపై నిఘా పెంచాలని తెలిపారు. అక్రమ మద్యాన్ని సరఫరా చేసే మార్గాల్లో రూట్ వాచ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. చెక్ పోస్టుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, ఇతర రాష్ట్రాల మద్యం ఎపిలోకి రాండా చూడాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, కర్నూలు సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు పాల్గొన్నారు.


క్షేత్రగుడి చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న నాగ మద్దయ్య


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఆస్పరిలో మిస్టరీ హత్య..?

- మృతదేహం ఆచూకీ లేకుండా చేసిన వైనం

- పోలీసులకు సవాలుగా మారిన కేసు దర్యాప్తు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో ఆదివారం అర్ధరాత్రి సుబ్బారెడ్డి బొరుగుల బట్టి ఇంటి ఆవరణలో హత్య జరిగిన ఆనవాలను బట్టి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బారెడ్డి ఇంటి సమీపంలో టాయిలెట్ వెనుక ఎడమ చేతి రక్తపు ముద్ర ఉన్నాయి. తర్వాత పక్కనే ఉన్న ప్రహరీపై రక్తపు మరకలతో ముద్రలు ఉన్నాయి. అలాగే పక్కనే ఉన్న ఆర్‌సిఎం చర్చి వెనుక భాగంలో బాత్ రూమ్ వద్ద రక్తపు మడుగు ఉంది. ఆ రక్తపు మడుగు ఎక్కువగా ఉండడంతో అక్కడ ఉన్న మడుగును తూర్చడానికి చీపురు పుల్లను ఉపయోగించినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. రక్తపు చేతులను శుభ్రం చేసుకునేందుకు సబ్బు కూడా తెచ్చుకున్నట్లు తెలిసింది. ఆ ప్రాంతంలో సబ్బు కూడా ఉంది. ఈ సంఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తే మొదట సుబ్బారెడ్డి ఇంటి ఆవరణలో వ్యక్తిని పొడిచి తర్వాత ఆర్‌సిఎం చర్చి వెనుక భాగానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం తెలుసుకున్న సిఐ హనుమంతప్ప సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ టీంను రప్పించారు. డాగ్ స్క్వాడ్ సుబ్బారెడ్డి ఇంటితో పాటు చర్చి వెనుక భాగం, కస్తూరి స్కూల్ వెనుక భాగానికి వెళ్లి వచ్చింది. ఈ విషయంపై సిఐ హనుమంతప్పను వివరణ కోరగా.. జరిగిన సంఘటన మొత్తం అనుమానస్పందంగా కనిపిస్తోందని తెలిపారు. తమకేమీ ఆనవాలు దొరకలేదని, రక్తపు మరకలు, ఫింగర్ ప్రింట్స్ ల్యాబ్‌కు పంపామని చెప్పారు. నివేదిక అందిన తర్వాత కేసు దర్యాప్తు చేస్తామన్నారు. డాగ్ స్క్వాడ్ ఎఎస్ఐ పురుషోత్తం, ఫింగర్ ప్రింట్ టీం చలపతి, క్లూస్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఆదోని


శ్రీసాయి ఆదోని ఫేర్ ఎగ్జిబిషన్ వారి ఆధ్వర్యంలో బి.అల్లాబకాష్ సౌజన్యంతో సోమవారం ఆదోని ఆర్‌టిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిపో మేనేజర్ ఎమ్‌డి.రఫీక్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం దోహదపడుతుందన్నారు. ప్రజలు నీటిని దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఎస్‌టిఐ రాఘవేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటిని సక్రమంగా సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి లింగన్న మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో శుద్ధి చేయని నీటిని నేరుగా పంపింగ్ చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కాక తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. నీటి ఎద్దడిని తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో స్థానికంగా సచివాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, మండల కమిటీ సభ్యులు అయ్యప్ప, రామాంజనేయులు, బాష, చిన్న తిక్కన్న, లక్ష్మన్న, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజలకు అండగా ఉంటాం

- కౌతాళంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - కౌతాళం

రానున్న ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ప్రజలకు అండగా ఉంటామని కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ నుంచి సెంట్రల్ పోలీసులు భారీ కవాతు నిర్వహించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పోలీసు కవాతు కొనసాగింది. సెంట్రల్ ఫోర్స్, ఎస్ఎస్‌బి పోలీసులు సంయుక్తంగా నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా, పాత బస్టాండ్, వాల్మీకి సర్కిల్, ఎస్‌బిఐ బ్యాంకు, అంబేద్కర్ సర్కిల్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశమని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. అవాంఛనీయ సంఘటన జరిగినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భారీగా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని రామదుర్గం గ్రామం ఊరి చివర ఉన్న నగరడోన కొండల్లో కంకర క్వారీ దగ్గర భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్పీ కృష్ణకాంత్, పత్తికొండ ఎస్‌డిపిఒ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక పర్యవేక్షణలో ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, వారి సిబ్బంది యశ్వంత్, భాస్కర్, శంకర్ ఒక బృందంగా వెళ్లి అక్రమ మద్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. 124 బాక్సుల ఒరిజినల్ చీర్స్ డీలక్స్ (90 ఎంఎల్) విస్కీ 11, 904 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అక్రమ మద్యం నిలువ ఉంచుకోవడానికి నిందితులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అక్రమ మద్యంపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని, ప్రజలు కూడా తమకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఎఎస్ఐ నజీర్ అహ్మద్, పోలీసులు ఖాదర్ వలీ, సాగర్ పాల్గొన్నారు.


మద్యాన్ని చూపుతున్న పోలీసు సిబ్బంది

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం : సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులను రాష్ట్రం నుంచి తరిమికొట్టి, ఇండియా కూటమి నుంచి బలపరిచిన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించి, రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. సోమవారం ఎమ్మిగనూరు సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి సార్వత్రిక ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నమైనవని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సమైక్యత, సమగ్ర లౌకికవాదం, ప్రధానమైన హక్కులను హరించే పద్ధతులలో పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాలను రెచ్చగొట్టి గొడవలు సృష్టించి పరిపాలన కొనసాగిస్తోందని తెలిపారు. మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్లను కొల్లగొట్టి తిరిగి అధికారంలోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. బిజెపికి ఎదురు తిరిగి మాట్లాడితే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, మంత్రాలయం నియోజవర్గ నాయకులు భాస్కర్ యాదవ్, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, సిపిఐ నాయకులు మల్లికార్జున గౌడ్, నరసింహులు, ఉరుకుంద పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

జగన్ హయాంలో డ్రగ్స్‌కు కేరాఫ్‌గా ఎపి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



దేశంలో డ్రగ్స్ ఎక్కడ దొరికినా దాని మూలాలు మాత్రం ఎపిలోనే కనబడుతున్నాయని, జగన్ హయాంలో డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఎపిగా మారిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని స్వగ్రామమైన మాధవరంలోని స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అనంతపురానికి కియా మోటార్స్ కంపెనీ, కర్నూలుకు సోలార్, గోదావరి జిల్లాలకు ఆక్వా, చిత్తూరుకు ఎలక్ట్రానిక్స్, విశాఖకు ఐటి వంటివి గుర్తుకొస్తాయని తెలిపారు. ప్రస్తుతం దానికి విరుద్ధంగా జగన్ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అంటే గంజాయి, డ్రగ్స్ అంటూ దేశ నలుమూలల్లో వినిపిస్తోందని చెప్పారు. ఎటు చూసినా ఎపి వినాశనానికి ముందడుగు వేసినట్టు కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జగన్ రెడ్డిని ఈసారి ఓడించడం ఖాయమని, ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడిగా విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, మంత్రాలయం నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో ఉన్న తాను కచ్చితంగా విజయం సాధిస్తామని తెలిపారు.

యూనిట్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ మంత్రాలయం యూనిట్ గౌరవాధ్యక్షులుగా మంత్రాలయం చంద్రశేఖర రావు, అధ్యక్షులుగా కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ సయ్యద్ దూద్ బాష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం మంత్రాలయం, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు మండలాల కరస్పాండెంట్ల సమావేశం నిర్వహించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ నటరాజ్, కార్యదర్శి నాగరాజ్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేట్ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధి, తల్లిదండ్రులతో విద్యార్థుల క్రమశిక్షణ, నైతిక విలువలు విద్యాభివృద్ధి గురించి చర్చించే అంశాలు, పాఠశాలల సమస్యలు, గ్రామీణ, మండల పాఠశాలల సమస్యలపై అపుష్మ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా పెద్దకడబూరు కరస్పాండెంట్ శేఖర్, కోశాధికారిగా కోసిగి కరస్పాండెంట్ లక్ష్మన్న, సభ్యులుగా కృష్ణమూర్తి, విశ్వనాథ్ రెడ్డి, రాజశేఖర్, నాగార్జున రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న నాయకులు

30న 'రన్ ఫర్ జీసస్'

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 30న గుడ్ ఫ్రైడే పండగ సందర్భంగా 'రన్ ఫర్ జీసస్' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సునీల్ రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆస్పరి బైపాస్‌లోని మహిమ చర్చి నుంచి ప్రారంభమై కొత్త బస్టాండ్, భీమా సర్కిల్, మున్సిపల్ మెయిన్ రోడ్డు మీదుగా విక్టోరియాపేట సిఎస్ఐ చర్చి వరకు 'రన్ ఫర్ జీసస్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవుల ఐక్యత, దేశ శాంతి కోసం ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని క్రైస్తవ చర్చీల నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రెవరెండ్ పాస్టర్ భాస్కర్ బాబు, బెనహర్ ఫిలిప్, జకర్యా బర్నబాస్ ఉన్నారు.